కూల్చివేతలపై బ్లాక్‌మెయిల్

కంటోన్మెంట్‌లో హైడ్రా పేరుతో వేధింపులు

- ఫిర్యాదులు చేస్తామంటూ బెదిరింపులు
- భయం గుప్పిట్లో నాలాల పరివాహక కాలనీల ప్రజలు


బోయిన్‌పల్లిలోని హస్మత్‌పేట నాలా

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో హైడ్రా కూల్చివేతలు కొందరికి వరంగా మారుతున్నాయి.. నాలాలు, చెరువుల పరివాహక ప్రాంతాల్లోని నిర్వాసితులను బ్లాక్‌మెయిల్ చేస్తూ భారీగానే సొమ్ము చేసుకుంటున్నారు. వారి డిమాండ్లకు తలొగ్గక పోతే హైడ్రాకు ఫిర్యాదు చేస్తామంటూ బెదిరింపులకు పాల్పుతున్నారు. మరికొందరైతే ఏకంగా తమకు బోర్డు అధికారుల వద్ద పలుకుబడి ఉంది, మీ నిర్మాణాలు కూలిపోకుండా కాపాడుతాం, ఇందుకు తమకేదైనా ముట్టజెప్పాలంటూ బేరసారాలకు దిగారు. దీంతో ఆందోళనకు గురైన పలువురు యజమానులు బోర్డు కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు. తమ నిర్మాణాలు హైడ్రా కూల్చివేతల జాబితాలో ఉన్నాయో లేదో చెప్పాలంటూ ఆరా తీస్తున్నారు. అయితే ఈ విషయంలో కంటోన్మెంట్ అధికారులకే స్పష్టత లేకపోవడం మరింత గందరగోళానికి గురి చేస్తోంది.

స్పష్టతలేమితో గందరగోళం

కంటోన్మెంట్ పరిధిలోని పికెట్, హస్మత్‌పేట నాలాలు ఉన్నాయి. సుమారు ఐదు కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ నాలాలను ఆనుకుని వేల సంఖ్యలో నిర్మాణాలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు నాలాను ఆక్రమించి నిర్మించినవే కావడం గమనార్హం. అయితే ఈ నాలాల వాస్తవ వెడల్పు ఎంతనే విషయంలో అటు రెవెన్యూ, ఇటు బోర్డు అధికారుల వద్ద స్పష్టత లేదు. దీనికి తోడు ఆయా నాలాలకు ఇరువైపులా బఫర్ జోన్‌లోని నిర్మాణాలను సైతం కూల్చేస్తారనే వార్తలతో నిర్మాణదారులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధికి నై- కూల్చివేతలకు సై

పాలనా పరంగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో కొనసాగే కంటోన్మెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర అంతంత మాత్రంగానే ఉంది. కీలకమైన మున్సిపల్ వ్యవహారాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రమేయం ఏమీ ఉండదు. రోడ్లు, భవన నిర్మాణాలు, సానిటేషన్, తాగునీరు, వీధి దీపాల వంటి అంశాలన్నీ బోర్డు ఆధ్వర్యంలోనే కొనసాగుతాయి. కంటోన్మెంట్ చరిత్రలో ఇప్పటి వరకు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వ నిధులు కేటాయించిన దాఖల్లేవు. దీంతో గతంలో రాష్ట్ర ప్రభుత్వం నగర వ్యాప్తంగా చేపట్టిన స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్‌ఎన్‌డీపీ)లో కంటోన్మెంట్‌లోని నాలాలను విస్మరించారు. కంటోన్మెంట్ ఎగువన ఉన్న నాలాలను విస్తరించి, కంటోన్మెంట్‌లోని నాలాలను విస్మరించడంతో ఆయా నాలాల్లో ప్రవాహపు ఒత్తిడి మరింత పెరిగింది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడి నాలాల అభివృద్ధిపై దృష్టి సారించలేదు.

పరిహారం సొమ్ముతోనే పనులు

ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం 24 ఎకరాల కంటోన్మెంట్ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించారు. ఇందుకు గానూ రూ.303 కోట్ల పరిహారం సొమ్ముకు బదులుగా అంతే విలువ గల పనుల నిర్వహణకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో కంటోన్మెంట్ పరిధిలోని పికెట్, హస్మత్‌పేట నాలాల విస్తరణ, రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ లైన్‌ల ఆధునికీకరణ చేపట్టాలని నిర్ణయించారు. హైడ్రా ఆధ్వర్యంలో కొనసాగే నాలాల ఆక్రమణలతో పాటే అభివృద్ధి పనులూ చేపట్టనున్నట్లు బోర్డు అధికారులు పేర్కొంటున్నారు.

ఆందోళన అక్కర్లేదు



హైడ్రా కూల్చివేతల విషయంలో సామాన్యులు భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదు. ప్రస్తుతానికి కమర్షియల్ ఆక్రమణల తొలగింపు పైనే ప్రధానంగా దృష్టిసారించాం. నాలాల ప్రవాహానికి అనుగుణంగా విస్తరిస్తాం. అవసరమైన చోట రిటైనింగ్ వాల్స్ ఎత్తు పెంచే అవకాశాలను పరిశీలిస్తున్నాం. నాలాలతో పాటు వర్షపు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండే ఆక్రమణలను సైతం తొలగిస్తాం. హైడ్రా కూల్చివేతల పేరిట ఎవరైనా బ్లాక్‌మెయిల్‌కు పాల్పడితే తమకు ఫిర్యాదు చేయాల్సిందిగా కోరుతున్నాం.

– మధుకర్ నాయక్, కంటోన్మెంట్ సీఈఓ

సర్కారీ బడి కథ: మళ్లీ మొదటికి..

షెల్టర్ దొరికిందని సంబరపడిన కొద్దిరోజులకే తిరిగి పాత భవనంలోకే..

- రూఫ్ లీకేజీలు.. గోడలు షాక్ ఇవ్వడమే కారణం..
- 250 మంది..మూడు తరగతి గదులు..
- బయట షెడ్ల కిందే చదువులు..
- సనత్‌నగర్ ప్రభుత్వ రౌండ్‌టేబుల్ పాఠశాల దుస్థితి..


షెడ్ల కిందనే నేలబారు చదువులు...

సనత్‌నగర్: ఉన్నది మూడే మూడు తరగతి గదులు.. ఒక గదిలో మూడు తరగతులు..ఇరుకిరుకు గదుల మధ్యనే విద్యాభ్యాసం.. ఆ గదులూ చాలకపోవడంతో బయట షెడ్ల కింద నేలబారు చదువులు.. ఇక వర్షం పడిందంటే అవస్థలు వర్ణనాతీతం. ఇదీ సనత్‌నగర్ ఎస్సార్టీకాలనీలో ప్రభుత్వ రౌండ్‌టేబుల్ పాఠశాల దుస్థితి. ఈ పరిస్థితి నుంచి కాస్త విముక్తి కలిగించేలా గత విద్యా సంవత్సరం చివర్లో స్థానికంగా వినియోగంలో లేని ప్రభుత్వ టీఆర్టీ క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయించి ఆ పాఠశాలను అందులోకి మార్చారు. అయితే టీఆర్టీ క్వార్టర్స్‌లోకి షిఫ్ట్ చేసిన ఆనందం ఎంతో కాలం నిలవలేదు. వర్షాకాలం నేపథ్యంలో పురాతన క్వార్టర్స్ రూఫ్ లీకు కావడం, గోడలకు కరెంటు షాక్ రావడం వంటి సమస్యలతో మళ్లీ పాత భవనంలోకి మార్చడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు.

పెరిగిన అడ్మిషన్లు..తొలగని సమస్యలు..

ఒకే భవనంలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు కొనసాగుతున్నాయి. రెండు పాఠశాలల్లోనూ తెలుగు, ఇంగ్లీష్ మీడియాలు ఉన్నాయి. ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులు ఉండగా వారి కోసం ఎనిమిది గదులు ఉన్నాయి. ఇందులో ఒకటి కంప్యూటర్ ల్యాబ్, ఆఫీసులకు ఉపయోగిస్తుండగా ఆరు గదులు ఉన్నాయి. గదులు సరిపోకపోవడంతో పైఅంతస్తులో షెడ్డుల నిర్మాణంతో ఎలాగోలా తరగతుల నిర్వహణను నెట్టుకొస్తున్నారు. సమస్యల్లా ప్రైమరీ పాఠశాలదే. 250 మంది విద్యార్థులు ఉండగా కేవలం మూడు తరగతి గదులే ఉండడం గమనార్హం. ఇంకా ఏడు తరగతి గదుల అవసరం ఉంది. కానీ ఆ దిశగా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ ఆలోచన చేయడం లేదు.


ఒకే గదిలో మూడు తరగతుల నిర్వహణతో ఇరుకుగా కూర్చొన్న విద్యార్థులు..

ఒకే గదిలో రెండు మూడు తరగతులు..

మరీ ముఖ్యంగా ఒకే తరగతి గదిలో రెండు మూడు క్లాస్‌లను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో తరగతి గదిలో బెంచీలు సరిపోక కింద కూర్చోవాల్సిన పరిస్థితి. ఒక తరగతి గదిలో ఒకవైపు బెంచీలపై ఒక తరగతి, మరోవైపు బెంచీలపై మరో తరగతి, ఇక మధ్యలో నేలపై ఇంకో తరగతి నిర్వహించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయంటే సమస్య తీవ్రత ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఈ మూడు తరగతి గదుల్లో పరిస్థితి ఇలా ఉంటే..పాఠశాల ఆవరణలో దాతల సహకారంతో నిర్మించిన షెడ్డులో కింద కూర్చొని విద్యాభ్యాసం చేసే వారు మరెందరో.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: కిలో...రూపాయల్లో.. టమాటా.43, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 35, పందిరి బీర 45, క్యాబేజీ 15, క్యారెట్ 43, దొండ 35, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 55, గోకర కాయ 45, కీర 23, దోసకాయ 13, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 28, మొరంగడ్డ 35, కందగడ్డ 35, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు ఓయూలో మేధోమథనం

ఉస్మానియా యూనివర్సిటీ: నక్సల్స్ చర్యల పై నేడు ఓయూలో మేధోమథనం కార్యక్రమం జరగనున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర నాయకులు పగిడిపల్లి శ్రీహరి బుధవారం తెలిపారు. క్యాంపస్‌లోని దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో మార్టియస్ మెమోరియల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎంఎంఆర్) ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే కార్యక్రమంలో విశ్రాంత పోలీసు అధికారి పానుగంటి చంద్రమౌళి, ఏబీవీపీ నేత బాలకృష్ణ, సీనియర్ అడ్వకేట్ సురేందర్ రావు, సీనియర్ జర్నలిస్ట్ సురేష్ తదితరులు పాల్గొని ప్రసంగించనున్నట్లు తెలిపారు.

ఉదయ్‌నగర్‌లో విద్యుత్ అధికారుల పర్యటన..



సనత్‌నగర్: టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం బస్తీబాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ అధికారులు సనత్‌నగర్ ఉదయ్‌నగర్‌లో పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డీఈ బీమానాయక్, ఏడీఈ వంశీకృష్ణ, ఏఈ శేఖర్,ఉదయ్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

టీఆర్‌టీ కాలనీ సీవరేజీ సమస్యను పరిష్కరిస్తాం


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ టీఆర్‌టీ క్వార్టర్స్ ప్రాంతంలో నెలకొన్న సీవరేజీ సమస్యకు సత్వర పరిష్కారం చూపుతామని స్థానిక కార్పొరేటర్ సామల హేమ హామీ ఇచ్చారు. టీఆర్‌టీ క్వార్టర్స్ ప్రాంతంలో సీవరేజీ సమస్యలు ఎదురవుతున్నాయని స్థానికుల నుంచి ఫిర్యాదులు అందుతున్న క్రమంలో బుధవారం ఆమె జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. అక్కడి పరిస్థితిని పరిశీలించిన అనంతరం కాలనీ వాసులకు సీవరేజీ ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె జలమండలి అధికారులను కోరారు. జలమండలి మేనేజర్ కుషాల్, టీఆర్‌టీ వాసులు శేఖర్, ఖలీమ్ పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థుల కాలేజీ బదిలీకి 30 కిమీ నిబంధన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని డిగ్రీ కాలేజీల విద్యార్థులు ఒక కాలేజీ నుంచి మరోక కాలేజీ బదిలీ కావాలంటే రెండు కళాశాలల మధ్య దూరం 30 కిలోమీటర్ల దూరం ఉండాలని అధికారులు నిబంధన విధించారు. దీంతో నగర విద్యార్థుల బదిలీకి అవకాశం లేకుండా పోయింది. జంట నగరాలలో ఎక్కువ సంఖ్యలో కాలేజీలు దగ్గర దగ్గర ఉండటం వలన 30 కిలోమీటర్ల దూరం ఇబ్బందికరంగా మారిందన్నారు. 30 కిలోమీటర్ల దూరం కాకుండా జిల్లాల ప్రాతిపదికన బదిలీలకు అవకాశం కల్పించాలని విద్యార్థులు కోరారు. ఇదిలా ఉండగా మొదటి సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులు రెండో సంవత్సరానికి, రెండు పూర్తి చేసిన వారు మూడో సంవత్సరానికి కాలేజీల బదిలీల కోసం ఆగస్టు 2 వరకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

బీసీల రిజర్వేషన్ల తర్వాతే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయాలని ఆలిండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ డా.అవ్వారు వేణుకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఓయూలో మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్ల పై వివిధ పార్టీల నేతల ఊకదంపుడు ఉపన్యాసాలు అవసరం లేదన్నారు. బీసీల ఓట్ల కోసం కొన్ని పార్టీలు వెంపర్లు ఆడుతూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం సిగ్గుచేటు అన్నారు.

కంటోన్మెంట్‌లో ఉచిత వైద్య శిబిరం



రసూల్‌పురా: జనహిత సేవా ట్రస్ట్, ఆశ్రిత రెయిన్‌బో కమ్యూనిటీ కేర్, కిమ్స్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో కంటోన్మెంట్ మడ్‌ఫోర్ట్ ఉత్తరయ్య హట్స్‌లో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 240 మంది పేదలకు కిమ్స్ ఆసుపత్రి వైద్యులు బీపీ, షుగర్, ఆర్థోపెడిక్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అంద జేశారు. శిబిరంలో తిరుమలగిరి మండల ఆర్ఐ సునీల్, బస్తీ వ్యవస్థాపకులు ఉత్తరయ్య, జనహిత సేవా టాస్ట్ మేనేజింగ్ ట్రస్టి నరసింహమూర్తి పాల్గొన్నారు.

రైల్వే ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ జోనల్ అధ్యక్షుడిగా వినోద్

సికింద్రాబాద్: దక్షిణమధ్య రైల్వే ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జోనల్ అధ్యక్షుడిగా ఏ.వినోద్, కార్యదర్శిగా జి.దాశరథికృష్ణ ఎన్నికయ్యారు. సికింద్రాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఎన్నికల్లో యూనియన్ నాయకుడు ఏఆర్ రాజశేఖర్ బలపరిచిన ఎలిఫెంట్ యూనియన్ అభ్యర్థులు విజయం సాధించారు. యూనియన్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ధర్మనాయక్, అదనపు కార్యదర్శిగా కేపీ హరిప్రసాద్, కోషాధికారిగా ఎస్.పాయిబాబా విజయం సాధించారు.



టీజీ సెట్ నూతన సభ్యకార్యదర్శిగా ప్రొ.శ్రీనివాస్

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీ సెట్ (తెలంగాణ స్టేట్ ఎల్జిబిలిటీ టెస్ట్) నూతన సభ్య కార్యదర్శిగా ఓయూ ప్రొ. శ్రీనివాస్ నియమితులయ్యారు. ఓయూ సైన్స్ కాలేజీ అప్లయిడ్ జియో కెమిస్ట్రీ విభాగానికి చెందిన ఆయన బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ సూచించారు. బుధవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సర్కిల్–9 సహాయక రేషనింగ్ అధికారి చాముండేశ్వరితోపాటు రేషనింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ మాట్లాడుతూ రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీల అందజేత



సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజవకర్గంలోని నలుగురి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధిని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ బుధవారం సీతాఫల్‌మండిలోని క్యాంపు కార్యాలయంలో అందించారు. వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.6.80 లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాలను కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అందించారు.

బీసీ విద్యార్థుల చలో ఢిల్లీ

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం విద్యార్థులు ఢిల్లీ పయనమయ్యారు. చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా బీసీ విద్యార్థులు బుధవారం రైల్‌లో హైదరాబాద్ నుంచి ఢిల్లీకి తరలారు. బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మబోయిన సైదులు యాదవ్ ఆధ్వర్యంలో ఢిల్లీకి బయలుదేరారు.

బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో జీహెచ్‌ఎంసీ అధికారుల పర్యటన


పద్మారావునగర్ పార్కులో పర్యటిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిసర ప్రాంతాల్లో బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులు పర్యటించారు. మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా జీహెచ్‌ఎంసీ జాయింట్ కమీషనర్(హెల్త్) శంకర్, బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ డాకు నాయక్, ఇంజనీరింగ్ విభాగం డిప్యూటీ ఈఈ ఆంజనేయులు, ఏఈ చైతన్య, ఎంటమాలజీ విభాగం ఏఈ శ్రీనివాస్ రెడ్డి, పారిశుధ్య విభాగం సిబ్బంది తదితరులు కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. చెత్తాచెదారం, మట్టి కుప్పలు, వరదనీటి నిల్వలు, రోడ్ల దుస్థితిని అధికారులు పరిశీలించారు. అనంతరం పద్మారావునగర్ పార్కులో అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా వాకర్స్ పలు సమస్యలను అధికారులకు వివరించారు.

దర్జాగా నాలాల కబ్జా..!

లాలాపేట: తార్నాకలో నాలాలు, వర్షపు నీటి కాలువలు యథేచ్ఛగా కబ్జా అవుతున్నాయి. తార్నాక స్ట్రీట్ నెంబర్ 1లో కొందరు వ్యక్తులు ఓపెన్ నాలాపై స్లాబ్ వేసి వాటిపై పక్కా నిర్మాణాలు చేపట్టారు. తార్నాక స్ట్రీట్ నెంబర్ 1 లో ఓ వ్యక్తి నాలాపై పక్కాగా నిర్మాణం చేశారు. దానిపై వ్యాపార సముదాయాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. తార్నాక, మారుతీ నగర్, కమితీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉన్న నాలాను గత కొంత కాలంగా కొందరు మట్టితో పూడుస్తూ దాన్ని పూర్తిగా ఆక్రమించారు. ప్రతి సంవత్సరం వర్షాకాలానికి ముందు పూడిక తీయడమే లేదు. దీంతో వర్షపు నీరు, డ్రైనేజీ నీరు వెళ్లకుండా ఇబ్బంది కల్గిస్తున్నారు. ఈ విషయమై తార్నాక వాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏలాంటి ఫలితం లేకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నాలాపై వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించాలనీ డిమాండ్ చేస్తున్నారు. నాలాను పూర్తిగా పునరుద్ధరించాలనీ కోరుతున్నారు.



తార్నాకలో నాలాను ఆక్రమిస్తున్న దృశ్యాలు

అధికారులకు 'కొత్త' టెన్షన్

ఒక పోలింగ్‌బూత్‌లో 1200 మంది ఓటర్లకు మించి ఉండడానికి వీలు లేదు. ఓటర్ల జాబితా పకడ్బందీగా రూపొందించాలి. ఒక భవనంలోని కుటుంబాల ఓటర్లు అందరూ ఒకే పోలింగ్‌బూత్‌లో ఓటు వేసేవిధంగా ఉండాలి. గతంలో పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ ఈ సారి మాత్రం నిబంధనలు కచ్చితంగా అమలు చేయాల్సిందేనని ఎన్నికల అధికారులు కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ నియోజకవర్గ ఓటర్ల జాబితా రూపకల్పనతో పాటు పోలింగ్ బూత్‌లకు ఓటర్ల విభజన తదితర చర్యలపై ఇక్కడి అధికారులు ప్రత్యేక దష్టి సారిస్తున్నారు.

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో గతంలో జరిగిన రెండు జీహెచ్‌ఎంసీ, రెండు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 220 పోలింగ్ స్టేషన్లు నిర్దిష్టంగా ఉండేవి. ఏడాదికోమారు ఓటర్ల సంఖ్య పెరిగినా అవే బూత్‌లలో అటూ ఇటూ సరిపెట్టేవారు. తాజాగా ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరగడంతోపాటు, ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1200 ఓటర్లకు మించి ఉండరాదన్న నిబంధన అమలులోకి రావడంతో పరిస్థితి మారింది. ఫలితంగా అదనపు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయడం అనివార్యం అయింది.

45 కొత్త పోలింగ్ కేంద్రాలు...

నియోజకవర్గంలో మొత్తంగా 220 పోలింగ్‌బూత్‌లు ఉండగా అందులో 143 పోలింగ్‌బూత్‌లలో 1200కు మించి ఓటర్లు ఉన్నారు. పలు సవరణల అనంతరం నియోజవకర్గంలోని ఐదు డివిజన్లలో 45 కొత్త పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఇప్పటి వరకు 92 భవనాల్లో 200 పోలింగ్‌బూత్‌లు ఉండేవి. ఇప్పుడు అదనపు పోలింగ్ బూత్‌ల ఏర్పాటు కోసం మరో భవనాలు కావాల్సి ఉంది. ఆయా డివిజన్ల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు భవనాల్లో కొత్తగా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసేందుకు అన్వేషిస్తున్నారు.


పోలింగ్‌బూత్‌ల తీరుతెన్నులు సమీక్షిస్తున్న అధికారులు

మూడు నెలల్లో కసరత్తు పూర్తి

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్‌ను సమర్థవంతంగా పూర్తిచేయడం కోసం అవసరమైన వసతులు, అనువైన వాతావరణం ఉన్న భవనాలను మాత్రమే ఎంపిక చేసుకుని అందులో పోలింగ్‌బూత్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ తతంగాన్ని మూడు నెలల వ్యవధిలోపు పూర్తి చేయాల్సి ఉంది. అయితే రెండేళ్ల క్రితం నియోజకవర్గంలో 20 భవనాలు శిథిలావస్థకు చేరిన సందర్భంగా అందులోని పోలింగ్ కేంద్రాలను వేరే భవనాల్లోకి మార్చాల్సి వచ్చింది. అప్పట్లో 20 భవనాల ఎంపిక కోసమే ఇబ్బందుల పాలైన అధికారులు ఈ మారు కొత్తగా 45 భవనాలను ఎలా ఎంపిక చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

లష్కర్‌లో అదనంగా 45 పోలింగ్ బూత్‌ల ఏర్పాటు

- కొత్త భవనాల కోసం అన్వేషణ
- శిథిలావస్థలో కొన్ని బూత్‌లు..
- ఏడాదిలో పెరిగిన ఓటర్లు 24 వేలు
- 3 నెలల కార్యాచరణతో ముందుకు

ఇబ్బందులు లేకుండా చర్యలు



వచ్చే ఎన్నికల నాటి నుంచి ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇంటి నుంచి పోలింగ్‌బూత్‌కు వెళ్లడం మొదలు అన్ని విధాల సమాచారాన్ని ఇంటి నెంబర్ల ప్రాతిపదికన ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నాం. ఓటర్ల జాబితాలో సవరణలు మొదలు, పోలింగ్‌బూత్‌ల ఏర్పాటు వరకు ప్రజల సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకుంటాం. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జరుగుతున్న ఈ ప్రక్రియకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు సమాచారం అందించాలి.

–ఆంజనేయులు, సికింద్రాబాద్ ఎన్నికల అధికారి

నియోజకవర్గ పోలింగ్‌బూత్‌ల తీరు

డివిజన్	పాతవి	కొత్తవి (అంచనా)
అడ్డగుట్ట	42	51
తార్నాక	56	65
మెట్టుగూడ	36	45
సీతాఫల్‌మండి	52	61
బౌద్ధనగర్	34	43
మొత్తం:	220	265

ఏడాదిలో తేడా

ఏడాది	ఓటర్లు
2023-24	2,45 385
2024-25	2,69,281